సాక్షి కామారెడ్డి

బుధవారం । 26 । ఏప్రిల్ । 2023



మలేరియాను తరిమేద్దాం

జిల్లాలో మంగళవారం మలేరియా డే నిర్వహించారు. పలుచోట్ల వైద్య సిబ్బంది ర్యాలీలు నిర్వహించారు.

- 9లో ▸



ఇళ్ల స్థలాలివ్వాలి

బీడీ కార్మికులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకట్ గౌడ్ డిమాండ్ చేశారు.

- 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
38.4 /22.5

ఉదయం ఎండ కాస్తుంది. మధ్యాహ్నం ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లావ్యాప్తంగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

'ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తాం'



నిజాంసాగర్: రైతులు పండించిన ప్రతి వరి గింజను కొనుగోలు చేస్తామని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ దఫేదార్ శోభ పేర్కొన్నారు. మంగళవారం బూర్గుల్‌లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధాన్యం తూకాలకు కావాల్సిన అన్ని సౌకర్యాలు కల్పించాలని సొసైటీల అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో గున్కుల్ సొసైటీ చైర్మన్ వాజిద్ అలీ, తహసీల్దార్ నారాయణ, వ్యవసాయశాఖ అధికారి అమర్ ప్రసాద్, జెడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు, బీఆర్ఎస్ నాయకులు దుర్గారెడ్డి, లింగాల రాంచందర్, పుప్పాల విఠల్, అఫ్జల్, గజ్జెల జీవన్, రాములు, మనీష్‌రెడ్డి, సాయాగౌడ్, గంగమణి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల ఉపకరణాలకు దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్: సహాయ ఉపకరణాల కోసం దివ్యాంగులు వచ్చేనెల 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమాధికారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శారీరక వైకల్యం గలవారు, బధిరులు, అంధులు, మానసిక దివ్యాంగులు ఉపకరణాల కోసం httpr://tsobmms.cgg.gov.in వెబ్‌సైట్‌లో సదరం సర్టిఫికెట్‌తో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఎలుగుబంట్ల సంచారం



నిజాంసాగర్: నర్వ గ్రామ శివారులో మంగళవారం ఎలుగుబంట్లు సంచరించాయి. గ్రామానికి చెందిన పలువురు మహిళలు తునికాకు సేకరణ కోసం పాత చెరువు కట్ట వైపు వెళ్లారు. చెరువు కట్ట కింద పొదల్లో ఉన్న రెండు ఎలుగుబంట్లు వారివైపు పరుగెత్తుకుంటూ వచ్చాయి. సమీపంలో ఉన్న రైతులు, తాటి ముంజలు కోస్తున్న యువకులు దీనిని గమనించి కేకలు వేయడంతో రెండు ఎలుగుబంట్లు గుట్టవైపు వెళ్లిపోయాయి. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

'హమాలీ చార్జీల పెంపు'



కామారెడ్డి క్రైం: కొనుగోలు కేంద్రాలలో హమాలీ చార్జీ పెంచినట్లు అదనపు కలెక్టర్ చంద్రమోహన్ తెలిపారు. జిల్లాకేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం హమాలీ చార్జీలపై మార్కెటింగ్, ఐకేపీ, సహకార అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో 40 కేజీల ధాన్యం బస్తాకు రూ.15 హమాలీ చార్జి ఉండేదని, ప్రస్తుతం దానిని రూ.16.50 కి పెంచారని తెలిపారు. 50 కేజీల బస్తాకు గతంలో రూ. 16.50 ఉండగా.. దానిని ప్రస్తుతం రూ.18 కి పెంచారన్నారు. దడువై రూ.1.80 నుంచి రూ.2.25 కి, చాటవాలి రూ.1 నుంచి రూ.1.50 కి పెంచారన్నారు. మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో ప్రతి రెండేళ్లకోసారి హమాలీ చార్జీలను పెంచుతారని వివరించారు. కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి రమ్య, ఐకేపీ డీపీఎం రమేష్ బాబు, అధికారులు పాల్గొన్నారు.

సమ్మె ప్రభావం లేదు

కామారెడ్డి అర్బన్: విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఆర్టిజన్ల సమ్మె ప్రభావం జిల్లాలో లేదని ట్రాన్స్‌కో ఎస్‌ఈ రమేష్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సంస్థల్లో ఎస్మా అమలు చేస్తున్నందున సమ్మె చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. వివిధ జిల్లాల్లో సమ్మెలో పాల్గొన్న 200 మంది ఆర్టిజన్లను మంగళవారం తొలగించినట్లు సీఎండీ సమాచారం అందించారని తెలిపారు.

జిరాక్స్ కేంద్రాలకు అనుమతివ్వాలి

ఎల్లారెడ్డి: ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షల సమయంలో తమ దుకాణాలను తెరిచేందుకు అనుమతివ్వాలని కోరుతూ జిరాక్స్ కేంద్రాల నిర్వాహకులు మంగళవారం తహసీల్ సిబ్బందికి వినతిపత్రం ఇచ్చారు. ఓపెన్ పరీక్షలు జరుగుతున్న సమయంలో జిరాక్స్ సెంటర్లను నడపవద్దని అధికారులు నోటీసులు ఇచ్చారని, దీంతో నష్టపోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. నెల రోజులుగా ఇంటర్, టెన్త్ పరీక్షలు జరగడంతో తమ దుకాణాలను మూసి ఉంచామని, దీని వల్ల వ్యాపారం దెబ్బతిన్నదని పేర్కొన్నారు.



కోటాల్‌పల్లిలో కురిసిన రాళ్లు



హన్మాజీపేట్‌లో ధాన్యాన్ని ఎత్తుతున్న రైతులు



మహ్మద్‌నగర్‌లో నీటమునిగిన ధాన్యం కుప్పలు



వెల్లుట్లపేటలో విరిగిన స్తంభం, నేలవాలిన చెట్టు



సురాయిపల్లిలో టవర్ విరిగి విద్యుత్ తీగలపై వాలిన దృశ్యం

ప్రకృతి ప్రకోపం!

- వడగండ్ల వానతో పంటలకు తీవ్ర నష్టం
- నేలరాలిన వరికంకులు, కొట్టుకుపోయిన వడ్లు
- రైతన్నను ఆగంజేసిన వరుణుడు

సాక్షి, కామారెడ్డి: వడగండ్ల వాన రైతులకు కడగండ్లు మిగిల్చింది. ఇప్పటికే తెగుళ్లతో పంటలు దెబ్బతిని ఇబ్బందులు పడ్డ రైతాంగం.. పంట చేతికొచ్చిన సమయంలో కురిసిన అకాల వర్షంతో మరింత నష్టాల్లో మునిగిపోయాడు. జిల్లాలో మంగళవారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు భారీ వర్షం కురిసింది. చాలాచోట్ల రాళ్లవాన పడింది. లింగంపేట, ఎల్లారెడ్డి, నిజాంసాగర్, బాన్సువాడ, బీర్కూర్, రాజంపేట, బీబీపేట, దోమకొండ, గాంధారి, తాడ్వాయి, భిక్కనూరు, మాచారెడ్డి, నాగిరెడ్డిపేట తదితర మండలాల్లో భారీ వర్షం కురిసింది. పంట చేతికొచ్చిన సమయంలో కురుస్తున్న వానలు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి.

దెబ్బ మీద దెబ్బ...

యాసంగిలో వరి పంటను తెగుళ్లు ఇబ్బంది పెట్టాయి. ముఖ్యంగా మొగిపురుగుతో చాలా గ్రామాల్లో వరి కంకులు పాల్లుపోయాయి. తెగుళ్ల నుంచి కాపాడేందుకు రైతులు రకరకాల మందులు పిచికారీ చేశారు. పాల్లు పోగా మిగిలిన పంటను వడగండ్లు నష్టం చేశాయి. ఇప్పటికే చాలామంది రైతులు వరి కోసి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించారు. కాంటాలు ఇంకా మొదలుకాకపోవడంతో కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం కూడా కొట్టుకుపోయింది. వర్షం రాకముందు గాలిదుమారం లేవడంతో వరికుప్పలపై కప్పిన కవర్లు కొట్టుకుపోయాయి. చాలాచోట్ల ధాన్యం రాశులు తడిసిముద్దయ్యాయి. వర్షం నుంచి పంటను కాపాడుకునేందుకు రైతులు నానా ఇబ్బందులు పడ్డారు. చాలా గ్రామాల్లో మక్కలు కూడా నానిపోయాయి. అలాగే కూరగాయల పంటలను వడగండ్లు దెబ్బతీశాయి. మామిడి తోటలకూ నష్టం వాటిల్లింది.

లింగంపేటలో 55.5 మి.మీ. వర్షం...

జిల్లాలో మంగళవారం భారీ వర్షం కురిసింది. అత్యధికంగా లింగంపేట మండలంలో ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు 55 మి.మీ. వర్షపాతం నమోదయ్యింది. ఇదే మండలంలో వడగండ్లు విపరీతంగా కురిశాయి. నాగిరెడ్డిపేటలో 36.8 మి.మీ., రామలక్ష్మణ్‌పల్లిలో 27.8 మి.మీ., బీర్కూర్‌లో 27.3 మి.మీ., పుల్కల్‌లో 21.8 మి.మీ., దోమకొండలో 20.3 మి.మీ., సర్వాపూర్‌లో 19.8 మి.మీ.,, బొమ్మన్‌దేవ్‌పల్లిలో 18.5 మి.మీ., హసన్‌పల్లిలో 16.5 మి.మీ., రామారెడ్డిలో 14.8 మి.మీ., పాతరాజంపేటలో 14.8 మి.మీ., మాచాపూర్‌లో 11.8 మి.మీ., నస్రుల్లాబాద్‌లో 10.8 మి.మీ. వర్షపాతం నమోదయ్యింది.

ఇద్దరి మృత్యువాత..

బలమైన గాలులు ఇద్దరి ప్రాణాలు తీశాయి. భిక్కనూరు మండలం బాగిర్తిపల్లికి చెందిన నీల పద్మ(38) పండ్లు అమ్ముకోవడానికి మెదక్ జిల్లా రామాయంపేటకు వెళ్లింది. తిరుగు ప్రయాణంలో మరో వ్యక్తితో కలిసి బైక్‌పై వస్తుండగా.. రామాయంపేట శివారులో ఈదురు గాలులకు చెట్టుకొమ్మ విరిగి ఆమెపై పడింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన పద్మ ప్రభుత్వ ఆస్పత్రిలో మరణించింది. అలాగే నాగిరెడ్డిపేట మండలంలోని ధర్మారెడ్డి గ్రామానికి చెందిన అంద్యాల పద్మ(45)పై ఇంటి రేకులు పడడంతో అక్కడికక్కడే మరణించింది.

గాలివాన బీభత్సం



బలమైన ఈదురు గాలులు వీయడంతో పలుచోట్ల విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. ఎల్లారెడ్డి మండలంలోని వెల్లుట్లపేట గ్రామంలో బైండ్ల రాజు, రామవ్వ, లక్ష్మణ్‌లకు చెందిన ఇంటి రేకులు కొట్టుకుపోయాయి. విద్యుత్‌స్తంభాలు విరిగిపడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. తాడ్వాయి మండలంలోని ఎర్రాపహాడ్ శివారులో గల కామారెడ్డి -ఎల్లారెడ్డి ప్రధాన రహదారిలో చెట్టు కొమ్మలు పడడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. లింగంపేట మండలంలోని సురాయిపల్లి గ్రామంలో గాలికి టవర్ వంగి ప్రమాదకరంగా మారింది. లింగంపేటలో ఈదురుగాలులకు కమ్మం శేఖర్ ఇంటి రేకులు కొట్టుకుపోయాయి. లింగంపేట వైన్‌షాప్ ప్రాంతంలో విద్యుత్ స్తంభం నేలకొరిగి ప్రమాదకరంగా మారింది. ట్రాన్స్‌కో సిబ్బంది వెంటనే స్పందించి మరమ్మతులు చేసి, విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.



బాన్సువాడ మార్కెట్ కమిటీలో ధాన్యంలో చేరిన వర్షపు నీరు



లింగంపేటలో తడిసిన ధాన్యాన్ని తీస్తున్న రైతులు



నాగిరెడ్డిపేట మండలం పోచారంలో కొట్టుకుపోయిన వడ్లు



నస్రుల్లాబాద్ మండలం లింగంపల్లిలో నీటమునిగిన వడ్లు

30న కానిస్టేబుల్ మెయిన్స్ పరీక్ష

- ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్లు
- ఉమ్మడి జిల్లాలో 640 పోస్టులు

జిల్లా	పోస్టులు(సివిల్)	పోస్టులు(ఏఆర్)
కామారెడ్డి	154	86
నిజామాబాద్	266	134

ఖలీల్‌వాడి: జిల్లాలో ఈ నెల 30న కానిస్టేబుల్ మెయిన్స్ పరీక్ష నిర్వహించడానికి పోలీస్‌శాఖ సన్నద్ధమవుతోంది. అందులో భాగంగా పార్ట్–2కు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు సంబంధించిన హాల్‌టికెట్లు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచారు. అభ్యర్థులు ఈ నెల 28 వరకు హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని రాష్ట్ర పోలీస్‌మండలి స్పష్టం చేసింది. ఉమ్మడి జిల్లాలో 10,131 మంది ఫిజికల్ టెస్ట్‌లకు హాజరయ్యారు. సివిల్ పోలీస్, టీఎస్ఎస్పీ, ఆర్మ్‌డ్ రిజర్వు, ఎస్పీఎఫ్, ఫైర్, జైళ్లశాఖ, రోడ్డు ట్రాన్స్‌పోర్ట్, ఎక్సైజ్ కానిస్టేబుల్ పోస్టులకు ఈ నెల తుది రాత పరీక్ష నిర్వహించబోతున్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో పోలీస్ నియామక మండలి పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయనుంది. ప్రతి అభ్యర్థి www.tslprb.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి తమ లాగిన్ ఐడీ ద్వారా హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అధికారులు తెలిపారు.

నాగన్నగారి బావికి త్వరలో పర్యాటక శోభ



బావి పునరుద్ధరణ పనులపై సూచనలిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

లింగంపేట: మండల కేంద్రంలోని నాగన్నగారి బావికి త్వరలో పర్యాటక శోభ వస్తుందని కలెక్టర్ జితేష్ వి పాటిల్ పేర్కొన్నారు. బావి పునరుద్ధరణ పనులను కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెట్లబావి పునరుద్ధరణ పనులు ఆర్కిటెక్ట్ కల్పన రమేశ్ ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయన్నారు. త్వరలోనే బావి పర్యాటక స్థలంగా రూపొందుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్రం నలుమూలల నుంచి పర్యాటకులు వచ్చే అవకాశాలున్నాయన్నారు. పర్యాటకులతో లింగంపేట ప్రసిద్ధి చెందుతుందన్నారు. ఆయన వెంట ఎంపీడీవో మల్లికార్జున్‌రెడ్డి, తహసీల్దార్ రాజేశ్వర్, కార్యదర్శి శ్రావణ్, యువ యూత్ అధ్యక్షుడు శ్రీకాంత్ ఉన్నారు.

పరీక్ష కేంద్రం తనిఖీ



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలోని ఓపెన్ టెన్త్ పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ మంగళవారం తనిఖీ చేశారు. పరీక్షలను సక్రమంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. అనంతరం మైనారిటీ బాలుర జూనియర్ కళాశాల, బీసీ బాలికల వసతి గృహం, జేబీఎస్ ప్రాథమిక పాఠశాలలను పరిశీలించారు. మైనారిటీ బాలుర జూనియర్ కళాశాల డిగ్రీ కళాశాలకు చెందిన భవనంలో కొనసాగుతోందని, దీంతో కళాశాలకు చెందిన బాలికలకు హాస్టల్ ఏర్పాటుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రవీణ్‌కుమార్ ఫిర్యాదు చేయడంతో కలెక్టర్ భవనాలను పరిశీలించారు. మైనారిటీ బాలుర కళాశాలను జేబీఎస్ స్కూల్‌లోకి, జేబీఎస్ స్కూల్‌ను జెడ్పీ బాలుర పాఠశాల ఆవరణలోకి, ప్రస్తుతం అద్దె భవనంలో కొనసాగుతున్న బీసీ బాలికల హాస్టల్‌ను డిగ్రీ కళాశాల హాస్టల్ భవనంలోకి మార్చేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

గులాబీ సంబురం!

- నియోజకవర్గాల వారీగా ప్లీనరీలు
- హాజరైన పార్టీ ప్రతినిధులు
- అభివృద్ధి ఏకరువు పెట్టిన ఎమ్మెల్యేలు
- ప్రత్యర్థులపై విమర్శలతో దాడి



బాన్సువాడలో మాట్లాడుతున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి



కామారెడ్డిలో మాట్లాడుతున్న గంప గోవర్ధన్

సాక్షి, కామారెడ్డి: బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం జిల్లాలో ఘనంగా నిర్వహించారు. ఊరూరా పార్టీ జెండాలను ఆవిష్కరించారు. అనంతరం నియోజక వర్గ స్థాయిలో ప్లీనరీలు ఏర్పాటు చేశారు. జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజక వర్గాల్లో మంగళవారం జరిగిన ప్లీనరీలు విజయవంతమయ్యాయి. రాష్ట్రం ఆవిర్భావం తర్వాత జరిగిన అభివృద్ధిపై ఎమ్మెల్యేలు సుదీర్ఘంగా మాట్లాడారు. ప్రత్యర్థి పార్టీలపై విమర్శలు గుప్పించారు.

బాన్సువాడలో నిర్వహించిన నియోజకవర్గ ప్లీనరీలో స్థానిక ఎమ్మెల్యే, అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ సహకారంతో రూ.10 వేల కోట్లతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని వివరించారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన కామారెడ్డి నియోజకవర్గ ప్లీనరీలో స్థానిక ఎమ్మెల్యే గంప గోవర్ధన్ పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ పార్టీపైనా విమర్శలు చేశారు. సమావేశంలో ఎమ్మెల్సీ దండు విఠల్ పాల్గొని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. బిచ్కుంద మండల కేంద్రంలో నిర్వహించిన జుక్కల్ నియోజకవర్గ ప్లీనరీలో స్థానిక ఎమ్మెల్యే హన్మంత్ సింధే మాట్లాడారు. నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని వివరించారు. కాంగ్రెస్, బీజేపీలు చేస్తున్న తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఎల్లారెడ్డి పట్టణంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి ప్లీనరీలో స్థానిక ఎమ్మెల్యే జాజాల సురేందర్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీధర్ పాల్గొన్నారు.

శ్రేణుల్లో జోష్ నింపే ప్రయత్నం..

ప్లీనరీ ద్వారా కేడర్‌లో జోష్ నింపేందుకు బీఆర్ఎస్ నేతలు ప్రయత్నించారు. ఇప్పటికే ఆత్మీయ సమ్మేళనాలతో పార్టీ శ్రేణులకు తామున్నామనే భరోసా ఇచ్చిన ఎమ్మెల్యేలు.. నియోజకవర్గ ప్లీనరీ ద్వారా ప్రభుత్వం చేసిన అభివృద్ధిని, అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ, ప్రజల్ని చైతన్యం చేయాలని కోరారు. ప్రతిపక్షాలను టార్గెట్‌గా చేసుకుని మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధిని ఆధారాలతో వివరించి ప్రతిపక్షాల నోళ్లు మూయించాలని కార్యకర్తలకు సూచించారు. బీజేపీ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నా కాంగ్రెస్ పార్టీ నేతలపైనా విమర్శలు చేశారు. ఎక్కడా తగ్గేదిలేదన్న రీతిలో క్యాడర్‌లో ఉత్సాహం నింపేలా ఎమ్మెల్యేల ప్రసంగాలు సాగాయి.

కన్నీరు పెట్టిస్తున్న ఉల్లి

- గణనీయంగా పడిపోయిన ధర
- కిలోకు రూ. 8 లోపే..
- పెట్టుబడి కూడా తిరిగి రావడం లేదని రైతుల ఆవేదన



రాజంపేటలో ఓ రైతు పొలంలో రాశిగా పోసిన ఉల్లిగడ్డలు

బీబీపేట: ఉల్లి పంటకు మార్కెట్‌లో కనీస ధర కూడా లభించకపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. కిలోకు రూ. 10 కూడా దక్కడం లేదంటున్నారు. జిల్లాలో బీబీపేట, దోమకొండ, రాజంపేట, భిక్కనూరు, సదాశివనగర్ మండలాల రైతులు అధికంగా ఉల్లి సాగు చేస్తున్నారు. ఒక్క రాజంపేట మండలంలోనే 100 ఎకరాలకుపైగా సాగయ్యింది.

పెట్టుబడి బారెడు..

ఎకరం భూమిలో ఉల్లి సాగు చేయాలంటే రూ. 20 వేలపైనే పెట్టుబడి అవుతుంది. ఎకరాకు 25 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. మంచి ధర ఉంటే లాభాలు వస్తాయని ఆశించిన రైతులను మార్కెట్ నిరాశ పరుస్తోంది. మూడు వారాల క్రితం కిలోకు రూ. 15 నుంచి రూ. 20 వరకు ధర లభించగా.. ప్రస్తుతం కిలోకు రూ. 7 నుంచి రూ. రూ. 8 కూడా దక్కడం లేదని రైతులు పేర్కొంటున్నారు. ఓవైపు సాగు ఖర్చులు గణనీయంగా పెరగాయని.. మరోవైపు ధరేమో పడిపోతోందని దీంతో నష్టాలే మిగులుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉల్లికి మద్దతు ధర లభించేలా సర్కారు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఏం లాభం లేదు..



ఎకరం విస్తీర్ణంలో ఉల్లి సాగు చేశాను. పంట తీద్దామంటే కూలీలు దొరకడం లేదు. కూలీ రేట్లు కూడా పెరిగాయి. మొన్నటి దాకా కిలోకు రూ. 15 పైనే ధర లభించింది. ఇప్పుడు రూ. 10 కి పడిపోయింది. ధర వచ్చేవరకు నిల్వ చేసుకుందామంటే గిడ్డంగులు లేవు. ఉల్లిసాగు చేస్తే ఏం లాభం లేదు. – శివోళ్ల బాలవ్వ, రైతు, బీబీపేట

క్లుప్తంగా

ఆర్చరీ శిక్షణ శిబిరం ప్రారంభం



నిజామాబాద్ నాగారం : తెలంగాణ రాష్ట్ర క్రీడా సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని నాగారం లోని రాజారాం స్టేడియంలో ఆర్చరీ ఖేలో ఇండియా శిక్షణ శిబిరం ప్రారంభమైంది. మంగళవారం డీవైఎస్‌వో ముత్తెన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రీడాకారులు ఆర్చరీలో శిక్షణ తీసుకొని ఉన్నతంగా ఎదగాలన్నారు. జూన్ 10 వరకు శిక్షణ కొనసాగుతుందన్నారు. వివరాలకు కోచ్ మురళి 9848919480 సంప్రదించాలన్నారు.

బీపీఈడీ పరీక్షల్లో ఒకరి డిబార్



తెయూ(డిచ్‌పల్లి) : తెయూ పరిధిలో రంజాన్ సందర్భంగా వాయిదా పడిన బీఈడీ మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు మంగళవారం పునఃప్రారంభమైనట్లు కంట్రోలర్ ప్రొఫెసర్ ఎం అరుణ తెలిపారు. మధ్యాహ్నం జరిగిన మొదటి సెమిస్టర్ పరీక్షల్లో 1,303 మందికి గానూ 1,232 మంది హాజరు కాగా 71 మంది గైర్హాజరైనట్లు కంట్రోలర్ అరుణ తెలిపారు. ఆర్మూర్ నరేంద్ర డిగ్రీ కాలేజ్ పరీక్షా కేంద్రాన్ని కంట్రోలర్ అరుణ సందర్శించారు. మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడుతున్న ఒక విద్యార్థి డిబార్ చేసినట్లు కంట్రోలర్ తెలిపారు.

ప్రశాంతంగా పరీక్షలు

తెయూ పరిధిలో కొనసాగుతున్న బీపీఎడ్ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా జరిగినట్లు కంట్రోలర్ ప్రొఫెసర్ ఎం అరుణ తెలిపారు. ఉదయం జరిగిన 3వ సెమిస్టర్ పరీక్షల్లో 22 మందికి గానూ 18 మంది హాజరు కాగా 4గురు విద్యార్థులు గైర్హాజరైనట్లు కంట్రోలర్ తెలిపారు.

దివ్యాంగుడికి వీల్‌చైర్ బహూకరణ

ఖలీల్‌వాడి : తీవ్రమైన అనారోగ్యంతో నడవలేని స్థితిలో ఉన్న ఈర శ్రీనివాస్ అనే వ్యక్తికి జిల్లా న్యాయసేవాధికార సంస్థ తరఫున వీల్‌చైర్‌ను సంస్థ చైర్ పర్సన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల మంగళవారం బహూకరించారు. సిరికొండ మండల కేంద్రానికి చెందిన శ్రీనివాస్ అనారోగ్య, ఆర్థిక పరిస్థితికి తోడు నడవలేని అతని భౌతిక స్థితిని తెలుసుకున్న సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి ఒక నివేదికను, సమాచారాన్ని సంస్థ చైర్ పర్సన్, జిల్లాజడ్జి కి నివేదించారు. దీంతో నిధులు సమీకరించిన ఆయనకు వీల్ చైర్ అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల మాట్లాడుతూ బాధితులకు చేదోడువాదోడుగా న్యాయసేవా సంస్థ నిలుస్తుందన్నారు. సంస్థ పర్యవేక్షకులు పురుషోత్తం గౌడ్, చంద్రసేనా రెడ్డి, పారా లీగల్ వాలంటీర్లు రఘునాథ శర్మ తదితరులు పాల్గొన్నారు.

వడగండ్లు.. కడగండ్లు



కామారెడ్డి - ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై పడ్డ చెట్లు



లింగంపేటలో నేలకొరిగిన విద్యుత్ స్తంభం

- పంటలన్నీ వర్షార్పణం
- నేలరాలిన వరి, ఇతర పంటలు
- ఆందోళనలో రైతులు

జిల్లావ్యాప్తంగా వడగండ్ల వాన రైతులను అతలాకుతలం చేసింది. రెండు రోజుల పాటు కురిసిన వడగండ్ల వర్షానికి పంటల నష్టం లెక్కలేకుండా ఉంది. చేతికి వచ్చిన నువ్వులు, వరి పంటలకు అపారమైన నష్టం వాటిల్లింది. కురిసిన వడగండ్ల వాన కారణంగా ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. కొన్నిచోట్ల నీటి ప్రవాహానికి కొట్టుకుపోయింది. విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. నువ్వుల పంట నేలవాలింది. నష్టాన్ని అంచనా వేసేందుకు వ్యవసాయ శాఖ అధికారులు రంగంలోకి దిగారు. ఆయా ప్రాంతాల్లో పంటనష్టాన్ని అంచనా వేస్తున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



సింగితంలో ధాన్యం కుప్ప చుట్టూ చేరిన వర్షం నీరు



కోటాల్‌పల్లిలో కురిసిన రాళ్ల వర్షానికి నేల రాలిన వరి ధాన్యం



ఎల్లారెడ్డిలోని లింగారెడ్డిపేటలో..



దోమకొండలో ఇళ్ల మధ్య నిలిచిన వర్షం నీరు



గర్గుల్‌లో తడిసిన వరి



గాలీపూర్ కొనుగోలు కేంద్రం వద్ద నీళ్ల మధ్య ఉన్న వరికుప్పలు



బోర్లంలో వడగండ్లను చూపుతున్న రైతు



కొయ్యగుట్ట వద్ద రోడ్డుపై పడిన చెట్టు



సురాయిపల్లిలో కొనుగోలు కేంద్రంలో వరదనీటిలో మునిగిన ధాన్యం



హన్మాజీపేట్‌లో రాలిన వడ్లు



బోర్లం కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని కప్పేసిన వడగండ్లు



బాన్సువాడలో ఇంటి ఎదుట పడ్డ వడగండ్లు



మాచారెడ్డి మండలం అక్కాపూర్ లో పొలంలో రాలిన వడ్లు

చోరీ కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు

కామారెడ్డి క్రైం : దేవనపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో గతేడాది జరిగిన నాలుగు చోరీ కేసుల్లో ప్రధాన నిందితుడైన ఓ వ్యక్తికి కామారెడ్డి కోర్టు మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ మంగళవారం తీర్పు వెల్లడించింది. గతేడాది దేవునిపల్లి ఠాణా పరిధిలో పలు చోరీ కేసులు నమోదయ్యాయి. ఎస్సై ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి తగిన ఆధారాలను సేకరించి నిందితుడైన దేవునిపల్లికి చెందిన బిక్కాజీ రంజిత్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. అంతేగాకుండా నిందితుడి వద్దనుంచి రూ. 10 లక్షల విలువైన ఆభరణాలు, నగదును రికవరీ చేశారు. నాలుగు నేరాల విషయంలో మంగళవారం జ్యూడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వెంకటేష్ దుర్వ సాక్ష్యాధారాలను పరిశీలించి నేరం రుజువు కావడంతో నిందితునికి మూడు సంవత్సరాల జైలు శిక్ష, ఒక్కో నేరానికి రూ. 400 చొప్పున జరిమానా విధించారు. నిందితునికి శిక్ష పడటంలో విశేషంగా కృషి చేసిన రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై ప్రసాద్, కోర్టు డ్యూటీ ఆఫీసర్ రజనీకాంత్, లైసనింగ్ అధికారి హనుమాండ్లు, పీపీ అశోక్‌ను ఎస్పీ శ్రీనివాస్ రెడ్డి అభినందించారు.

గ్రామాభివృద్ధిపై భిన్నాభిప్రాయాలు

- రెండుగా చీలిన కాచాపూర్
- ఫ్యాక్టరీ డబ్బులతోఅభివృద్ధి అవసరం లేదని కొందరు..
- నిబంధనల మేరకే ఫ్యాక్టరీ నిధులిస్తుంటే తప్పేంటని మరి కొందరి వాదన
- ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా వీడీసీ నిరసన ప్రారంభం

భిక్కనూరు : ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న ఫ్యాక్టరీ ఇస్తున్న నిధులతో కాచాపూర్ గ్రామం అభివృద్ధి చేస్తే ఒప్పుకోమని కొందరు పేర్కొంటుండగా.. నిబంధనల మేరకే గ్రామాభివృద్ధికి ఫ్యాక్టరీ నుంచి నిధులు వస్తుంటే తీసుకుంటే తప్పేమిటని కొందరు.. ఇలా భిన్నాభిప్రాయాలతో భిక్కనూరు మండలం కాచాపూర్ గ్రామం రెండుగా చీలిపోయింది. వివరాల్లోకి వెళ్తే.. భిక్కనూరు మండల కేంద్రంలో ఎంఎస్ఎన్ కెమికల్ ఫ్యాక్టరీ ఉంది. అయితే ఈ ఫ్యాక్టరీ కారణంగా సమీపంలో ఉన్న కాచాపూర్ గ్రామం చెరువులో చేపలు మృతి చెందుతున్నాయని, అలాగే వాతావరణం నీళ్ల కలుషితం అవుతున్నాయని, దుర్వాసన వస్తోందని పలు మార్లు కాచాపూర్ గ్రామస్తులు ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. వీడీసీ కూడా మద్దతు తెలిపింది. ఫ్యాక్టరీ యాజమాన్యం గ్రామానికి వచ్చి ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూసుకుంటామని పేర్కొన్నప్పటికీ పరిస్థితిలో ఎలాంటి మార్పు రాలేదు. అయితే ఫ్యాక్టరీ సీఎస్ఆర్ నిధులు రూ. 1.50 కోట్లతో భిక్కనూరులో వీధి దీపాలు రోడ్డు డివైడర్లను ఏర్పాటు చేయించింది. అలాగే కాచాపూర్‌లోనూ రోడ్డు డివైడర్, హైమాస్ట్ లైట్లు, సీసీ కెమెరాల ఏర్పాటు సీఎస్ఆర్ నిధులివ్వాలని జీపీ పాలకవర్గం సర్పంచ్ సులోచన ఆధ్వర్యంలో ఎంఎస్ఎన్ ఫ్యాక్టరీని లేఖలో కోరగా వారు సమ్మతించి అవసరమైన రూ. 11.30 లక్షలను ఇచ్చేందుకు ముందుకొచ్చింది. అయితే ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఫ్యాక్టరీ నిధులు మనకొద్దని కొందరు యువకులు పట్టుబడుతున్నారు. ప్రజాభిప్రాయ సేకరణలో యువకులు రెండుగా చీలిపోగా అభిప్రాయా సేకరణ నిలిచిపోయింది. ఫ్యాక్టరీ నిధులు కాచాపూర్‌కు అవసరం లేదని పేర్కొంటూ వీడీసీ సభ్యులు స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. అయితే ఫ్యాక్టరీ నిబంధనల మేరకే నిధులిస్తోందని అభివృద్ధి చేసుకుందామని ప్రజాప్రతినిధులు కొందరు యువకులు వాదిస్తున్నారు.



కాచాపూర్ గ్రామపంచాయతీ వద్దకు తరలి వచ్చిన గ్రామస్తులు



ఎంఎస్ఎన్ ఫ్యాక్టరీ యాజమాన్యానికి నిరసనగా నిరసన తెలుపుతున్న యువకులు

ఫ్యాక్టరీ నిధులతో అభివృద్ధి వద్దు



ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న ఫ్యాక్టరీ నిధులతో అభివృద్ధి పనులు చేయించాలని అనుకోవడం సిగ్గుచేటు. ఎంఎస్ఎన్ కెమికల్ ఫ్యాక్టరీ వల్ల భిక్కనూరు, పెద్దమల్లారెడ్డి కాచాపూర్, అయ్యవారిపల్లి గ్రామాలకు ఇబ్బంది కలుగుతుంది. దుర్వాసన వస్తుంది. ప్రజలకు ఇబ్బంది కలుగకుండా చూసుకోకుంటే ఆందోళన చేస్తాం. అవసరమైతే కోర్టుకు వెళ్తాం. అభివృద్ధి పనులను అడ్డుకుంటాం. ఉద్యమాన్ని ముమ్మ రం చేస్తాం.

– మహిపాల్, వీడీసీ అధ్యక్షుడు కాచాపూర్

నిబంధనల మేరకే..



ఎంఎస్ఎన్ కెమికల్ ఫ్యాక్టరీ నిబంధనల ప్రకారమే గ్రామాభివృద్ధికి సీఎస్ఆర్ నిధులిచ్చేందుకు ముందుకొచ్చింది. ఫ్యాక్టరీ వల్ల కలుగుతున్న ఇబ్బందుల గురించి యాజమాన్యంతో చర్చించి నివారణ చర్యలు తీసుకునే విధంగా ఒత్తిడి తెస్తాం. కాని గ్రామాభివృద్ధికి ముందుకొచ్చి ఇస్తున్న నిదులను వద్దనడం కరెక్ట్ కాదు. ఫ్యాక్టరీ వల్ల ప్రజలకు ఇబ్బందిలేకుండా చూసేందుకు తాము ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటాం.

– తొగరి సులోచన సుదర్శన్ సర్పంచ్ కాచాపూర్

కోర్టు డ్యూటీ సిబ్బందికి అభినందన

ఖలీల్‌వాడి : నేరస్తులకు జీవిత ఖైదీలుగా శిక్షలు ప డేందుకు కృషి చేసిన కోర్టు, పోలీస్‌సిబ్బందిని పోలీ స్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్ మంగళవారం అభినందించారు. నగరంలోని సీపీ కార్యాలయంలో మూడో, ఐదో పోలీస్‌స్టేషన్ పరిధిల్లో నేరాల్లో జీవితఖైదీలకు శిక్షలు పడేందుకు కృషి చేసిన వారిని శాలువలతో సన్మానం చేసి ప్రశంసాపత్రాలు అందించారు. జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రవిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో హత్య కేసు నిందితులు..?

ఖలీల్‌వాడి : రంజాన్ రోజు జరిగిన గొడవలో కాంప్రమైజ్ కోసం పిలిచి యువకుడిని హత్య చేసిన నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. జిల్లా కేంద్రంలోని ఐదో పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాబాన్ సాహెబ్ పహాడ్‌లో మహమ్మద్ అర్బాజ్‌ఖాన్(18)ను హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ హత్య కేసులో ప్రధాన నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టినట్లు సమాచారం. రంజాన్ రోజు హాజీ తన స్నేహితులతో కారులో వెళ్లే సమయంలో బైక్‌పై వెళ్లుతున్న అర్బాజ్‌ఖాన్‌పై బురద చిల్లించడంతో వీరి మధ్య గొడవకు దారితీసింది. ఆదివారం జరిగిన ఘటనపై పోలీసులు అక్కడ ఉన్న సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించిట్లు తెలిసింది. ఈ హత్య కేసులో పోలీసులు ఐదుగురిని గుర్తించి, వీరితో పాటు మరికొందరు పేర్లు తెరపైకి రావడంతో వారిని కూడా విచారణ జరిపి కేసులు నమోదు చేయాలని భావిస్తున్నట్లు తెలిసింది. నగరంలోని బాబాసాహెబ్‌పహాడ్‌లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

క్రైం కార్నర్

ట్రాలీ ఆటో నుంచి సిలిండర్లు చోరీ

ఖలీల్‌వాడి : నగరంలోని ఒకటో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆహ్మదీపురా కాలనీలో ఇండియన్ గ్యాస్ సంబంధించిన గ్యాస్ సిలెండర్ల ట్రాలీ ఆటో నుంచి సిలిండర్లు చోరీ జరిగినట్లు ఎస్సై ఉదయ్‌కుమార్ తెలిపారు. అంచ సురేందర్ అనే వ్యక్తి బైక్‌పై వచ్చి సిలెండర్లు చోరీ చేసినట్లు గ్యాస్ కంపెనీకి చెందిన మహ్మద్ తెమాజ్‌ఖాన్ ఫిర్యాదు చేశారన్నారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

గుడిసె దగ్ధం



మోపాల్(నిజామాబాద్‌రూరల్) : మండలంలోని మంచిప్ప తండాలో దేవిసింగ్‌కు చెందిన నివాసపు గుడిసె సోమవారం రాత్రి షాక్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలో ఈదురుగాలులకు విద్యుత్ తీగలు తగిలి నిప్పురవ్వలు గుడిసెపై పడటంతో ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదంలో దుస్తులు, నిత్యావసర సరుకులు, టేకు దుంగలు, మంచాలు, ఇతరత్ర అన్ని వస్తువులు కాలిబూడిదయ్యాయి. నివాసపు గుడిసె కాలిపోవడంతో కుటుంబం రోడ్డున పడిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నారు. కాగా ఆర్ఐ రాజేశ్వర్ పంచనామా నిర్వహించారు. సుమారు రూ.4.04లక్షల వరకు ఆస్తినష్టం జరిగిందని తెలిపారు.

కుక్కల దాడిలో 14 గొర్రెలు మృత్యువాత



మోపాల్(నిజామాబాద్‌రూరల్) : నగర శివారులోని బోర్గాం(పి) 5వ డివిజన్‌లో సోమవారం అర్ధరాత్రి జరిగిన కుక్కల దాడిలో 14 గొర్రెలు మృతి చెందాయి. గ్రామంలోని దండు చిన్న భూమయ్యకు చెందిన 11 గొర్రెలు, రాములుకు చెందిన 4 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. మరో 4 గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి. కుక్కల దాడిలో సుమారు రూ. లక్ష వరకు నష్టం జరిగిందని బాధితులు పేర్కొన్నారు. ప్రభుత్వం ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని వారు కోరారు.

ట్రాక్టర్ ఢీకొని మున్సిపల్ కార్మికుడి మృతి



ఆర్మూర్ లింగం(ఫైల్)

ఖలీల్‌వాడి : మున్సిపల్ కార్పొరేషన్ డ్రైవర్ నిర్లక్ష్యంగా ట్రాక్టర్ నడిపి పారిశుధ్య కార్మికుడిని ఢీకొనడంతో మృతి చెందినట్లు ఎస్సై పూర్ణేశ్వర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఈ నెల 18న నగరంలోని ఖిల్లా రోడ్డులోని గోల్డెన్‌జూబ్లీ స్కూల్ దగ్గర అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి ఆర్మూర్ లింగం(48) ఉదయం ఏడు గంటలకు చెత్త ఎత్తుతున్నాడు. అయితే డ్రైవర్ నిర్లక్ష్యంగా ట్రాక్టర్ గేర్ వేసి వెనుక చెత్త ఎత్తుతున్న పారిశుధ్య కార్మికుడు ఆర్మూర్ లింగం పైకి తీసుకెళ్లడంతో ఆయనకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే ఆయనను స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మంగళవారం మధ్యాహ్నం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడు సర్కిల్ నెం. 3లో పారిశుధ్య కార్మికుడిగా పని చేస్తున్నారు. మృతుని కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కుటుంబ కలహాలతో ఒకరు..

బోధన్‌టౌన్(బోధన్) : పట్టణంలోని రాకాసీపేట్ కాలనీలో నివాసం ఉంటున్న షేక్ అక్బర్(28) కుటుంబ కలహాలతో కలత చెంది సోమవారం రాత్రి ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని పట్టణ ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని రాకాసీపేట్‌కు చెందిన షేక్ అక్బర్ కూలీ పనిచేసుకుంటు కుటుంబాన్ని పోషించేవాడు. ఏడు నెలల క్రితం నిజామాబాద్ నుండి బోధన్ పట్టణంలోని రాకాసీపేట్ కాలనీకి వచ్చి అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. మద్యానికి బానిసైన అక్బర్ ప్రతి రోజు ఇంట్లో భార్యతో గొడవ పడేవాడన్నారు. సోమవారం రాత్రి మద్యం సేవించి గొడవ పడగా భార్య తన పిల్లలను తీసుకుని తన అన్న ఇంటికి వెళ్లిందని, ఇంట్లో ఒంటరిగా ఉన్న అక్బర్ మనస్తాపంతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. మృతుడికి కొడుకు, కూతురు ఉన్నారని, భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత..



కస్తూరి (ఫైల్)

ఖలీల్‌వాడి : నగరంలోని నాలుగవ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బ్యాంక్‌కాలనీ(పాంగ్రా)కి చెందిన వివాహిత మహిళ కస్తూరి(28) అనుమాన్పదంగా మృతి చెందింది. ఎస్సై సందీప్ తెలిపిన వివరాల ప్రకారం.. కస్తూరి కాలనీలోని పలు ఇళ్లల్లో పనిచేస్తుందని, రోజువారీగా ఇళ్లల్లో పనికి వెళ్లిన ఆమె ఈనెల 22న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదన్నారు. ఆమె భర్త మల్లేష్ భార్య కోసం వెతికి చివరికి ఈ నెల 24న పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు. బ్యాంక్‌కాలనీలోని రమాదేవి వెంచర్‌లోని ఓ ఇంట్లోని బాత్‌రూం నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారన్నారు. ఈ ఇల్లు అమ్మడానికి పెట్టడంతో ఆ ఇంట్లో ఎవరూ లేరని, మృతదేహం పూర్తిగా కుళ్లిపోయిందన్నారు. మృతురాలికి కుమారుడు బబ్లూ, కుమార్తె సాకేతా ఉన్నారని క్లూస్‌టీంతో విచారణ చేస్తున్నామని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

మద్యం తాగి రైతు..



లింగంపేట(ఎల్లారెడ్డి) : మండల కేంద్రానికి చెందిన బాజ లక్ష్మణ్(55) అతిగా మద్యం సేవించి మృతి చెందినట్లు ఎస్సై శంకర్ తెలిపారు. మృతుడు 24వ తేదీ సోమవారం ఇంట్లో నుంచి వెళ్లాడు. రాత్రి ఇంటికి రాకపోవడంతో చుట్టు పక్కల వెతికారు. ఆచూకీ లభించలేదు. మంగళవారం ఉదయం మండల కేంద్రంలోని పోస్టాఫీస్ సమీపంలో కుంట వద్ద మద్యం సేవించి వాంతులు చేసుకొని అక్కడే మృతి చెందినట్లు గ్రామస్తులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతునికి భార్య లింగమణి, ఇద్దరు కుమారులు కిషోర్, నవీన్ ఉన్నారు.

చెరువులో పడి ఒకరు..



నిజాంసాగర్(జుక్కల్) : జుక్కల్ మండలం బస్వాపూర్ గ్రామ శివారులోని బసవన్న చెరువులో పడి మంగళ వారం చంద్రుగొండ(42) అనే వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై మురళి తెలిపారు. బస్వాపూర్ గ్రామానికి చెందిన చంద్రుగొండ మద్యానికి బానిసై తాగిన మైకంలో చెరువులో పడి మృతి చెందాడన్నారు. మృతునికి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దార్యప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.